## బయోలాజికల్ ఇండస్ట్రీని సందర్శించిన బృందం



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బయోలాజికల్ ఇండస్ట్రీస్‌ని బుధవారం నేషనల్ డిఫెన్స్ కాలేజీ ఆఫ్ మినిస్ట్రీ, డిఫెన్స్ కోర్స్ ఆన్ నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్‌కు చెందిన 16 మందితో కూడిన బృందం సభ్యులు సందర్శించారు. అనంతరం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలెక్టర్ గౌతమ్‌ను బృందం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారికి స్వాగతం పలకడంతో పాటు కలెక్టరేట్ పరిపాలన విభాగం, భౌగోళిక పరిస్థితులు, పని విధానం తదితర అంశాలను ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖలు, వాటి వివరాలను కూడా సభ్యులకు కలెక్టర్ తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



ప్రీతంను సత్కరిస్తున్న పోచారం నాయకులు

పోచారం: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను పోచారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర రాజు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు



ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు

మేడ్చల్‌రూరల్: మాజీ మంత్రి, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు బుధవారం మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. వేడుకల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని నాయకులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొని ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్ రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్ సరస్వతి తదితరులు ఈటల రాజేందర్‌కు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## వాలీబాల్ టోర్నీ విజేత వీబీఐటీ



షీల్డ్ అందుకుంటున్న వీబీఐటీ వాలీబాల్ క్రీడాకారులు

ఘట్‌కేసర్: శామీర్‌పేట్‌లోని ఐపీఈ ఎంబీఏ కళాశాలలో నిర్వహించిన రణరంగం పురుషుల వాలీబాల్ టోర్నీలో అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల పురుషుల జట్టు విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన చివరి రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలేజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ హాజరై విజేత జట్టుకు షీల్డ్‌తో పాటు క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీబీఐటీ పీడీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వీబీఐటీ పురుషుల వాలీబాల్ జట్టు క్రీడాకారులు పాల్గొన్నారు.

## 'గ్రేట్ ప్లేస్ టు వర్క్'గా వెల్‌స్పన్

సాక్షి, సిటీబ్యూరో: గృహావసరాలకు సంబంధించిన ఉత్పత్తులకు పేరొందిన వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ సంస్థ గ్రేట్ ప్లేస్ టూ వర్క్‌గా నిలిచింది. గ్రేట్ ప్లేస్ టూ వర్క్ సర్టిఫైడ్ ఇన్ ఇండియా ద్వారా ఈ గుర్తింపు లభించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉద్యోగుల మనోభిప్రాయాలను సర్వే ద్వారా నిర్ధారించి ఆ ఫలితాలను అనుసరించి ఇచ్చే ఈ గుర్తింపును దక్కించుకోవడం గర్వకారణమని, సంస్థలోని ప్రతి ఒక్కరి కృషి వల్లే ఇది సాధ్యపడిందని సంస్థ సీఈఓ దీపాలి గోయెంకా ఈ సందర్భంగా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## సీఎంఆర్ కళాశాల ఎదుట ఏబీవీపీ ధర్నా



మేడ్చల్ రూరల్: నిబంధనల పేరుతో విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారంటూ కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా నిర్వహించారు. కండ్లకోయలోని సీఎంఆర్ గ్రూపునకు చెందిన సీఎంఆర్‌సెట్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. కళాశాలలో మొదటి సంవత్సరం సీఎస్ఈ చదువుతున్న వైభవ్ అనే విద్యార్థి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫీజులు కట్టలేదు. దీంతో ఆయన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆరు నెలలుగా కళాశాల యాజమాన్యం కళాశాల చుట్టూ తిప్పుతూ విద్యార్థిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధర్నాలో పాల్గొన్న ఏబీవీపీ జిల్లా కన్వినర్ నాగేష్ తెలిపారు. ధర్నా అనంతరం కళాశాల యాజమాన్యం స్పందించి మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

మౌలాలి: మౌలాలి డివిజన్ శ్రామికనగర్ కాలనీలో మౌలిక వసతులను కల్పిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శ్రామికనగర్ కాలనీ నూతన కార్యవర్గం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు మహ్మద్‌గౌస్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హమీద్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

# బీ కేర్‌ఫుల్..

### సోషల్ మీడియాలో రాజకీయ అంశాలు.. వార్తల పరిశీలన

- నిబంధనలకు విరుద్ధమైన పోస్టులపై కఠిన చర్యలు
- అడ్మిన్‌కు నోటీసులు.. ఆ తర్వాత క్రిమినల్ కేసులు
- ఆరుగురితో మీడియా మానిటరింగ్ కమిటీ నియామకం

పార్లమెంట్ ఎన్నికల వేళ.. ఎన్నికల సంఘం సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టింది. రాజకీయ అంశాలతో పాటు వార్తల పరిశీలనపై దృష్టి సారిస్తోంది. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై కఠిన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. సంబంధిత అంశాల మేరకు అడ్మిన్‌కు నోటీసులు అందజేయడంతో పాటు క్రిమినల్ కేసుల నమోదుకు కూడా సిద్ధం అవుతున్నట్లు పేర్కొంటున్నారు. – సాక్షి, మేడ్చల్ జిల్లా



◆ శాస్త్ర, సాంకేతిక రంగాలు విస్తరించడంతో నగర, పట్టణ, బస్తీ, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు దర్శనమిస్తున్నాయి. యువతీయువకులు అత్యధికంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకోవడానికి తమ పార్టీ కార్యకర్తలతో కొత్త వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయించి.. ప్రచార కార్యక్రమాలు నమోదు చేస్తున్నారు. ఇందుకోసం కొన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియా టీమ్‌లు(వారియర్స్) కూడా నియమించి.. ప్రచారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియాలో వివిధ రకాల పోస్టులతో రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో విమర్శలు హద్దులు దాటి గొడవలకు దారి తీస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నియావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ప్రచార కార్యక్రమాలు, రాజకీయ విమర్శలు పరిశీలన చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

### మీడియా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

◆ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లాలో రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాలో నమోదు చేస్తున్న ప్రచార కార్యక్రమాలను పరిశీలించేందుకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని నియమించారు. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధ్వర్యంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(యూఎల్‌సీ) వంశీమోహన్, ఈ–జిల్లా మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి(సోషల్ మీడియా నిపుణుడు), జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి యూ.అరుంధతి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నుంచి ఎం.వెంకటరమణ, కె.వెంకటేశ్వర్లును సభ్యులుగా నియమించారు. వీరు ప్రతిరోజూ వివిధ దినపత్రికల్లో వచ్చే రాజకీయ అంశాలు, వార్తలు పరిశీలించడంతో పాటు స్థానిక సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలను క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా రెచ్చగొట్టేలా ప్రసంగాలు, విమర్శలు నమోదు చేసిన సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, పోస్టులు నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతో పాటు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

### క్రిమినల్ కేసులు నమోదు..

సోషల్ మీడియాల్లో రాజకీయ పార్టీల నాయకులను కించపర్చేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వివాదాస్పద అంశాలను నమోదు చేస్తే క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుందని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సోషల్ మీడియాలో నమోదవుతున్న రాజకీయ అంశాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసినా, లేక ఎన్నికల అధికారులు పరిశీలించిన సంబంధిత గ్రూప్ అడ్మిషన్‌పై, పోస్టులు నమోదు చేసిన వ్యక్తిపై ఎన్నికల సంఘం రూపొందించిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. న్యాయమూర్తి పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు చట్టపరంగా శిక్ష విధిస్తారు. సాధారణ సమయంలో సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు చేస్తే నమోదు చేసే కేసులకు.. ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసులకు తేడా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కఠినమైన సెక్షన్లు నమోదు చేసి కేసులు పెడతారని పేర్కొంటున్నారు.

## రథోత్సవం.. వైభవోపేతం..



అన్నదానంలో వజ్రేశ్‌యాదవ్, కౌన్సిలర్ మణికంఠ తదితరులు

మేడ్చల్: మేడ్చల్ రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారు జామున రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి రథశాల వరకు స్వామి వారి రథాన్ని భక్తులు లాగారు. పచ్చటి తోరణాలు, విద్యుత్ దీపాలతో రథాన్ని అందంగా అలంకరించి అందులో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఉదయం స్వామి వారికి దోపుసేవ, లంకాదహనం నిర్వహించడంతో జాతర ప్రారంభమైంది.

**భక్తులకు అన్నదానం**

జాతర సందర్భంగా భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కౌన్సిలర్ మణికంఠ ఆధ్వర్యంలో ఆలయంలో, ఆలయ పరిసరాల్లో భక్తులకు వివిధ సంఘాల వారు అన్నదానం చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ స్వామి వారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశంలో చెత్త వేస్తే పెనాల్టీ వేస్తాం

### నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో నివాసముంటున్న ప్రజలందరూ ప్రతిరోజూ డోర్ టు డోర్ చెత్త ఆటో వాళ్లకి చెత్తను అందించాలని, లేదంటే బహిరంగ ప్రదేశంలో చెత్తను వేస్తే పెనాల్టీ వేస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారిలో గల పెద్దకప్పు నాలా వద్ద చెత్త వేసిన ప్రదేశాన్ని బుధవారం ఆయన జేసీబీ సహాయంతో క్లీనింగ్ చేయించి ఆ స్థలంలో మొక్కలను నాటించారు. దుకాణదారులు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది చేత 120 మైక్రాన్స్ కంటే తక్కువగా ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న షాపులకు పెనాల్టీ విధించి సుమారు రూ.22,500 జరిమానా వసూలు చేస్తారు. కార్యక్రమంలో పాల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.



నాగారం మున్సిపల్ పరిధిలోని పెద్దకప్ప వద్ద చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

## విదేశీ విద్యపై అవగాహన అవసరం

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- మల్లారెడ్డి యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ ఫెయిర్



ఎడ్యుకేషన్ ఫెయిర్ సావనీర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, శ్రీకర్, అలెగ్జాండర్ మెక్‌లారెన్

మేడ్చల్‌రూరల్: విద్యార్థులకు విదేశీ విద్యపై మరింత అవగాహన అవసరమని మాజీ మంత్రి, ఎమెల్యే మల్లారెడ్డి, గ్లోబల్ ట్రీ ఎండీ శ్రీకర్ ఆలపాటి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను బుధవారం యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెన్, సౌత్ ఆసియా ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషన్ హెడ్ అనితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ తెలుగు విద్యార్థులు విదేశాల్లో ఎక్కువ మంది ఉన్నారని, ఏ రంగంలో చూసినా మన వారు ఉన్నారని తెలిపారు. విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థులు అప్లికేషన్ మొదలు మంచి యూనివర్సిటీ ఎంపిక వరకు అన్నీ సక్రమంగా ఉండాలన్నారు. విదేశాల్లో చదివే విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలని, అందుకు మల్లారెడ్డి యూనివర్సిటీ అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. గ్లోబల్ ట్రీ ఎండీ శ్రీకర్ ఆలపాటి మాట్లాడుతూ విదేశాల్లో చదువుకునే విద్యార్థులు ఎక్కడెక్కడికో వెళ్లకుండా అన్ని సేవలు గ్లోబల్ ఎడ్యుకేషన్ నుంచి మల్లారెడ్డి యూనివర్సిటీలో అందించనున్నట్లు తెలిపారు. ఆఫర్ లెటర్, స్కాలర్‌షిప్, వీసా, విద్యార్థి ప్రొఫైల్ చూసి స్కాలర్‌షిప్ సైతం ఇవ్వనున్నట్లు వివరించారు. పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెన్ మాట్లాడుతూ అమెరికాలో చదువుతున్న తెలుగు విద్యార్థుల సంఖ్య ప్రతిఏటా పెరుగుతుందన్నారు. అనంతరం ఎడ్యుకేషన్ ఫెయిర్ సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, గ్లోబల్ ట్రీ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మోదీ గ్యారంటీ.. ఈటల ష్యూరిటీ

- మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ మేనిఫెస్టో విడుదల
- ఆవిష్కరించిన మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: మాజీ మంత్రి, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ తన జన్మదినం సందర్భంగా నియోజకవర్గ మేనిఫెస్టోను మోదీ గ్యారంటీ.. ఈటల ష్యూరిటీ పేరుతో విడుదల చేశారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఆయన నివాసంలో జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, నాయకులతో కలిసి మేనిఫెస్టో, బీజేపీ పథకాలతో రూపొందించిన క్యూ ఆర్ కోడ్ విడుదల చేశారు. ఏడు అంశాలు(వికసిత మల్కాజిగిరి, స్వచ్ఛ, స్కిల్డ్, ఆరోగ్య–ఆయుష్మాన్ మల్కాజిగిరి, ఆత్మనిర్భర నారీశక్తి, డిజిటల్, మేక్ ఇన్ మల్కాజిగిరి) పేరుతో మేనిఫెస్టో రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న ప్రధాని మోదీ మల్కాజిగిరిలో ఎన్నికల శంఖారావం ప్రారంభించారని తెలిపారు. ఉద్యమకారుడిగా నా చరిత్ర, మంత్రిగా పనిచేసిన తీరు ప్రజలకు తెలుసని, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ సమస్య పెద్ద ఛాలెంజ్ అని మేకిన్ ఇండియా నినాదంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరిస్తాన్నారు.



మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఈటల రాజేందర్

## మెడికల్ కాలేజ్ ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపండి

### వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన మౌలిక సదుపాయాలపై సంబంధిత శాఖ అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు ఆరా తీశారు. కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై బుధవారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ఆమె సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై సమర్పించిన నివేదికపై అధికారులతో మాట్లాడారు. వైద్య కళాశాల, ఆరోగ్య సంరక్షణపై ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించి సత్వరమే సమగ్ర ప్రతిపాదనలు పంపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను క్రిస్టినా చోంగ్తు ఆదేశించారు.



**అల్వాల్ టిమ్స్ నిర్మాణ పనుల పర్యవేక్షణ**

కలెక్టరేట్‌లో సమావేశం ముగిసిన తర్వాత మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించిన ఆమె పనులను పరిశీలించారు.

ఆస్పత్రి పనుల పురోగతిపై ఆరా తీయడంతో పాటు పనులు ఎంతవరకు పూర్తయ్యాయని, పెండింగ్ పనుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆస్పత్రి నిర్మాణ విషయాలు, పనుల పురోగతిని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సెక్రటరీ ఆదేశించారు. కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లారీ టైర్లు కాల్చిన గుర్తుతెలియని వ్యక్తులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో పార్కు చేసిన లారీ టైర్లను కాల్చిన వ్యక్తులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీటీవీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించాలని కోరారు. ఆకతాయిలు ఈ ఘటనకు పాల్పడి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఫిర్యాదు తీసుకొని విచారిస్తామని చెప్పారు.

## ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలు ఆక్రమిస్తే.. క్రిమినల్ కేసులే..





కీసర: ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. చీర్యాల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్–59 అసైన్డ్ స్థలంలో అక్రమంగా నిర్మించిన తొమ్మిది ఇళ్లను జేసీబీ సహాయంతో బుధవారం నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలను ఆక్రమించి రియల్టర్లు ఇళ్లు నిర్మించి అమాయకులకు విక్రయిస్తే సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## 'భారతి అల్ట్రాఫాస్ట్'తో నిర్మాణం వేగవంతం

మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ 5 స్టార్ ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ తెలంగాణలో విడుదల చేసినట్లు సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్ రెడ్డి తెలిపారు. మేడిపల్లి ఎస్ఆర్ ట్రేడర్స్ డీలర్ షాపులో 40 మంది తాపీ మేస్త్రీల సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతమవుతుందన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని పేర్కొన్నారు. మేస్త్రీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లను అందజేశారు.



తాపీ మేస్త్రీలకు బహుమతులను అందిస్తున్న టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్ రెడ్డి

## ఆస్తిపన్ను వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

అల్వాల్: ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల చివరి వరకు జీహెచ్ఎంసీ 90 శాతం వడ్డీ రాయితీ కల్పించిందని ఆస్తిపన్ను బకాయిదారులందరూ సద్వినియోగం చేసుకుని సత్వరమే పన్నులు చెల్లించాలని కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సిబ్బంది నిరంతరం ఆస్తిపన్నులపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

**రూ.కోటి 17 లక్షల చెక్కు అందజేత**

వెంకటాపురం డివిజన్‌లోని అంజుమన్ స్కూల్ ఆస్తిపన్ను బకాయి రూ.కోటి 17 లక్షల చెక్కును బుధవారం సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి పాఠశాల నిర్వాహకులు అందజేశారు. గత కొంతకాలంగా కోర్టు వివాదంలో ఉండటంతో ఆస్తిపన్ను చెల్లింపులో ఆలస్యమైందని వడ్డీ రాయితీ పథకం వర్తించడంతో బకాయిల చెల్లింపులు త్వరగా జరుగుతున్నాయని ఉపకమిషనర్ తెలిపారు. ఏఎంసీ నర్సింహ్మారెడ్డి, స్వామి, నారాయణరావు, రాజారామ్, సాయికుమార్ తదితరులున్నారు.



## వినతిపత్రం అందజేత

రామంతాపూర్ : రామంతాపూర్‌లోని భగాయత్ బఫర్‌జోన్, చిన్న చెరువు ప్రాంతంలో రాత్రి కాగానే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ దారి మీదుగా వెళ్లే వారిని బెదిరిస్తూ దాడులు చేస్తున్నారని బుధవారం రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణికి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఏసీపీ పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి పెట్రోలింగ్ పెంచుతామని వారినందరినీ ఒకేచోట చేర్చి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. మత్తు పదార్థాల సేవనం వల్ల జరిగే నష్టాలను వివరించే అవగాహన కల్పిస్తామన్నారు. బీజేపీ కన్వీనర్ బాలచందర్, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.